చుండూరు మారణకాండ

జస్టిస్ గంగాధరరావు నివేదిక

ఎట్టకేలకు చుండూరు న్యాయవిచారణ నివేదిక బయటకి వచ్చింది. జస్టిస్ గంగాధరరావుగారు ప్రభుత్వం పరిశీలించమన్న అన్ని అంశాలనూ పరిశీలించి 98 పేజీల నివేదిక రాసారు. దళితులు ఈ న్యాయ విచారణ కమీషన్‌ను బహిష్కరించడం తనకు ఒక ప్రతిబంధకం అయిందనీ, దళితేతరులు (అగ్రకులాలకు ఇది వారు పెట్టిన పేరు) పూర్తి నిజం చెప్పడానికి ఇష్టపడలేదనీ, కాబట్టి తాను ప్రధానంగా పోలీసులు, రెవెన్యూ అధికారుల సాక్ష్యాలపైన ఆధారపడవలసివచ్చిందనీ జస్టిస్ గంగాధర రావుగారు నివేదిక మొదట్లోనే ఒప్పుకున్నారు. తన నిర్ధారణలకు ఆ అధికారుల సాక్ష్యాలే ఆధారమని అన్నారు.

ఇది పూర్తిగా నిజం కాదని నివేదిక చదివిన వారికెవరికయినా అనిపించక తప్పదు. జస్టిస్ గంగాధరరావు గారికి స్వంత అభిప్రాయాలు చాలా వున్నాయి. వేరే సాక్ష్యాలు లేనిచోట ఈ అభిప్రాయాలతో ఖాళీలను పూరించారు.

> ### సారాంశంలో
>
> ☆ మొదటిది సర్వజనాభ్యుదయ పోరాట సమితి అవగాహన
>
> ☆ రెండవది ఊడబీకిన మునసబు కరణంల మనస్సులను రంజింపచేసే సూచన.
>
> ☆ మూడవది గ్రామ పెత్తందార్ల మనస్సుకు హత్తుకునే సూచన.
>
> ☆ నాలుగవది ఎస్.పి. మీనా మనస్ఫూర్తిగా నమ్మి శాయశక్తులా అమలుచేసిన అభిప్రాయం.
>
> ☆ ఐదవది మండల్ వ్యతిరేక ఉద్యమకారులు మెడకు మైక్ కట్టుకుని ప్రచారంచేసిన అవగాహన!

చుండూరు మారణకాండ ఎందుకు జరిగింది అనేది ప్రభుత్వం ఆయనను పరిశీలించమన్న మొదటి ప్రశ్న. దీనికి ఆయన స్పష్టమయిన జవాబు ఇచ్చారు. దళిత (ప్రధానంగా మాల) కులానికి చెందిన యువకులు ఇతర కులాల మహిళలను వేధించటం వంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడడంవల్ల అప్పటికే మాలలకూ ఇతర కులాలకూ మధ్యనున్న మన స్పర్థలు పెరిగి ఇతర కులాలు మాలలపైన దాడి చేసే పరిస్థితి ఏర్పడిందనేది ఈ ప్రశ్నకు వారిచ్చే జవాబు. 'సర్వజనాభ్యుదయ పోరాట సమితి' పేరిట అగ్రకులాలు ఆనాడు ప్రచారం చేసిన అవగాహన ఇదే. ఎటొచ్చీ గంగాధరరావు గారు అక్కడున్నది దళితులు - అగ్రకులాలు అన్న తేడా అనే విషయాన్ని కూడా కప్పిపెట్టి, మాలలు - ఇతర కులాలు అంటూ చర్చించారు. అందుకే నివేదికలో ఎక్కడా ఆయన అగ్రకులాలు అన్న మాటే వాడలేదు. దళితేతరులు అన్న మాటే ఉపయోగించారు. అయితే తన అభిప్రాయంవేరు, చుండూరు అగ్రకులాల అభిప్రాయం వేరు అని చెప్పడం కోసం 'వాళ్ళ వాంగ్మూలాలలో వాళ్ళు గొడవంతా మాల యువకులు ఇతర కులాల స్త్రీలని వేధించడం వల్లనే వచ్చిందనీ లేకపోతే అన్ని కులాలూ ఐక్యంగా బ్రతికేవారనీ అన్నారు. అదిచాలావరకు నిజమేగానీ అదే ఏకైక కారణం అని నేను అనుకోవడం లేదు' అంటూ భేదం చూపించుకున్నారు. ఏకైక కారణమూ లేకపోతే 'చాలావరకు నిజమే' అనేది భేదమే ననుకుంటే జస్టిస్ గంగాధరరావుగారికీ సర్వజనాభ్యుదయ పోరాట సమితికీ భేదం ఉందని ఒప్పుకోకతప్పదు.

చుండూరు హత్యాకాండకు పాల్పడింది ఎవరు అనేది ప్రభుత్వం ఆయనను పరిశీలించమన్న రెండవప్రశ్న. దీనికి మట్టుకే ఆయన జవాబు చెప్పలేదు. ఎందుకంటే దళితులు ఆయన ముందు హాజరుకాలేదు, హంతకుల వివరాలు చెప్పలేదు కాబట్టి. దళితుల దగ్గర పోలీసులు రికార్డు చేసుకున్న సెక్షన్ 161 స్టేట్‌మెంట్లు ఉన్నాయి కదా అంటారేమోనని చెప్పి, ఆ స్టేట్‌మెంట్లు ప్రామాణికం కావనీ, వాటిలోని నిజానిజాలు తేల్చడానికి వారిని క్రాస్ ఎగ్జామిన్ చేసే అవకాశం తనకు దొరకలేదనీ ఆయన అంటారు. అందువల్ల పోలీసులకు దళితులు ఇచ్చిన వాంగ్మూలాలలో హంతకుల పేర్లు ఉన్నప్పటికీ ఈ విషయంలో తానొక నిర్ధారణకు రాలేకపోతున్నానన్నారు. ఇది న్యాయమయిన వైఖరే. బాధితులు సహకరించకపోతే హంతకులు ఎవరనేది నిర్ణయించి ప్రకటించడం సాహసమే అవుతుంది. కానీ ఈ హేతుబద్ధమయిన వైఖరి మొదటి విషయంలో ఎందుకు సాధ్యం కాలేదు? బాధితుల ఘర్షణకు గల కారణం మట్టుకు గుర్తించడం ఏవిధంగా సాధ్యం అయింది? మొదటి విషయంలో బాధితులు పోలీసుకు ఇచ్చిన స్టేట్‌మెంట్లయినా ఉన్నాయి. అవి ప్రామాణికం కాకపోవడం వేరే విషయం. రెండవ విషయంలో ఆ మాత్రం కూడా బాధితుల అభిప్రాయం తెలుసుకునే అవకాశం లేదుకదా! అయినా ఆ విషయంలో ఎటువంటి మొహమాటం లేకుండా జస్టిస్ గంగాధరరావు గారు ఏవిధంగా నిర్ధారణకు రాగలిగారు.

నిజానికి ఏదయినా ఒక విషయం మీద న్యాయ విచారణ జరపడానికి ఉపక్రమించినప్పుడు ఇరుపక్షాలు కాకపోయినా కనీసం బాధితులు సహకరించాలి. ఏ కారణంగానయితేనేమి, బాధితులు సహకరించదలచుకోకపోతే నిజాయితీ గల న్యాయ విచారణాధికారి తన కిచ్చిన బాధ్యత నిర్వర్తించడం సాధ్యం కాదని ప్రభుత్వానికి చెప్పి తప్పుకోవాలి. కానీ న్యాయవిచారణలను న్యాయనిర్ణయానికి సంబంధించిన విధిగా కాక కేవలం జీతం ఇచ్చే ఉద్యోగంగా చూడడం ఇవాళ్టి నీతి కాబట్టి ఈ రకమయిన మొహమాటానికి తావులేకుండా పోయింది.

పోలీస్ అధికారుల వైఫల్యం ఏమయినా ఉందా అనేది మూడవ ప్రశ్న. పట్టపగలు భీకరంగా హత్యాకాండ జరిగితే దాని గురించి మరుసటి రోజుదాకా ఆ ఊరిలోనే ఉన్న పోలీస్ అధికారులకు తెలియలేదు. ఇందులో కేవలం వైఫల్యం కాదు, లాలూచీ కూడా ఉందని దళితులు ఆనాడు ఆరోపించారు. లాలూచీ లేదనుకుంటే చుండూరు అగ్రకులస్తులు పోలీసులను చాలా తెలివిగా బుట్టలో వేసుకున్నారనుకోవాలి. ఆగస్ట్ 6 పొద్దున్న సి.ఐ. సాయిబాబా, తెనాలి తాలూకా, వేమూరు, చుండూరు, అమృతలూరు ఎస్.ఐలు కలిసి అంతకుముందు జరిగిన ఘర్షణలలో నిందితులను అరెస్టు చేయడానికి బయలుదేరారు. మొదట అగ్రకులస్థుల ఇళ్ళు వెతికారు. అక్కడెవ్వరూ దొరకలేదు. తరువాత దళితుల ఇళ్ళమీదకి పోయారు. దళితులు పోలీసులనుచూసి పారిపోయారు. తరువాత పోలీసులంతా తమ స్టేషన్‌కు తిరిగి వచ్చారు. అంతలో కొందరు రెడ్లు పోలీస్ స్టేషన్‌కు వచ్చి దళితులు నలుగురు రెడ్లపైన దాడి చేసారని ఫిర్యాదు చేసారు. పోలీసులు వాళ్ళ స్టేట్‌మెంట్ రాసుకొని దాడిచేసిన వారికోసం వెతకడానికి పోయారు. అదే సమయంలో రెడ్లు పెద్ద సంఖ్యలో పోగయి పొలాలవైపు పోతుండడం పోలీసులు చూసారు. వాళ్ళచేతులలో కర్రలున్నాయి. వాళ్ళు వందల సంఖ్యలో ఉన్నారు. పోలీసులు వాళ్ళను కొంత దూరం తరిమి వెనక్కి వచ్చారు. వాళ్ళు పొలాల వెంబడి దళితులను తరిమి నరికి హతమారుస్తుండగా పోలీసులు కడుపులో చల్ల కదలకుండా చుండూరులో కూర్చున్నారు. పైగా, దళితుల వల్ల అగ్రకులాల పిల్లలకు ప్రమాదం ఉంటుందేమోనని వాళ్ళను స్కూలునుండి సురక్షితంగా ఇంటికి తీసుకొని రానడానికి అమృతలూరు ఎస్.ఐ. ఆధ్వర్యంలో బందోబస్తు కూడా ఏర్పాటయింది. నిజానికి రక్తసిక్తమయిన ఆ మధ్యాహ్నం చుండూరులో పోలీసులు చేసిన ఏకైక కార్యక్రమం ఇది. మారణకాండ నుండి ప్రాణాలతో తప్పించుకున్న కొందరు దళితులు ఆ రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత తెనాలి ఆర్.డి.వో. కు జరిగిన దారుణాన్ని గురించి చెప్పిన తరువాత గానీ హత్యాకాండ గురించి అధికారులు మేలుకోలేదు. అప్పుడు కూడా పోలీసులలో వెంటనే చలనం లేదు. ఆర్.డి.వో. సి.ఐ. సాయిబాబును అడుగగా అంతా ప్రశాంతంగానే ఉందనీ ఎవ్వరూ చనిపోలేదనీ జవాబు చెప్పాడు. 7వతేదీ పొద్దున్న దాకా శవాల కోసం వెతకడం ప్రారంభించలేదు.

ఇదంతా న్యాయవిచారణ కమీషన్ ముందు నమోదయిన సాక్ష్యం. నివేదికలో జస్టిస్ గంగాధరరావుగారు ఏకరువు పెట్టిన సాక్ష్యం. కర్రలు పట్టుకొని పెద్దగుంపుగా పొలాలవెంబడి పోతున్న అగ్రకులస్తులను ఊరికే కొంచెందూరం తరిమి వెనక్కి రాకుండా, చెదరగొట్టేంతవరకు తరిమే ప్రయత్నం ఎందుకు చేయలేదన్న ప్రశ్న గంగాధరరావుగారు పోలీసులను అడిగారు. అంతకుముందు పోలీసుల దాడికి భయపడి దళితులు పొలాలలోకి పారిపోయిన సంగతి పోలీసులకు తెలిసి పోతూ పోతూ మరి కొందరు రెడ్లను కొట్టి పోయారన్న ఫిర్యాదు కూడా పోలీసులు వద్ద ఉంది. అటువంటప్పుడు గుంపుగా కర్రలు పట్టుకొని పోతున్న అగ్రకులస్తులు పారిపోయిన దళితులపైన దాడి చేస్తారేమోనన్న అనుమానం పోలీసులకు ఎందుకు రాలేదని గంగాధరరావు గారు ప్రశ్నించారు. కనీసం రాత్రి తెనాలి ఆర్.డి.వో. ఫోన్ చేసి అడిగినప్పుడయినా ఎందుకు గ్రహించలేకపోయారనీ, అంతా ప్రశాంతంగా ఉందనీ సమాధానం ఏవిధంగా ఇవ్వగలిగారనీ ప్రశ్నించారు. చివరికి పోలీసుల వైఫల్యం గురించి ఆయన అభిప్రాయమేమిటంటే, సి.ఐ. సాయిబాబు గ్రామంలో దళితులపైనదాడి జరగకుండా రక్షణ కల్పించడంలో సఫలీకృతుడయ్యాడు. అయితే పొలాలలోనూ పొరుగూరిలోనూ దాడి జరగకుండా నిరోధించలేకపోవడం ఆయన వైఫల్యం. దీనికి అప్పటికే ప్రభుత్వం విధించిన తాత్కాలిక సస్పెన్షన్ చాలని జస్టిస్ గంగాధరరావుగారి అభిప్రాయం. అంటే ఆయన కొత్తగా విధించే శిక్షగానీ విచారణగానీ ఏమీ లేదు. ఇక చుండూరు ఎస్.ఐ. శ్రీనివాసులు మాటకొస్తే, ఇతర కులాలస్త్రీలను మా యువకులు వేధించినప్పుడు ఆయన సకాలంలో సరయిన చర్య తీసుకోకపోవడం వల్ల పరిస్థితి ఇక్కడి దాకా వచ్చిందంట. అంటే దళితులను ఎస్.ఐ. సకాలంలో అణచివేయకపోవడం వల్ల దళితులపైన హత్యాకాండకు దారితీసే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి! కాబట్టి శ్రీనివాసులును చుండూరు నుండి బదలీచేసి అతని స్థానంలో ఒక 'గట్టి మనిషిని' వేయాలని జస్టిస్ గంగాధరరావుగారి సూచన. 'గట్టి మనిషి' అంటే దళితులు తమను వేధిస్తున్నారని అగ్రకులస్తులు ఫిర్యాదు చేయగానే దళితులపైన కఠినమయిన చర్యలు తీసుకునే వాడని అర్థం. అటువంటి ఎస్.ఐ.లను చుండూరు వంటి ఊళ్ళలో వేస్తే ఏ మారణకాండలూ జరగవని జస్టిస్ గంగాధరరావు గారి అభిప్రాయం.

ఆగస్ట్ 10వ తేదీన (చుండూరు మృతుల అంత్యక్రియలు జరిగిన దినం) జరిగిన అల్లరిని, దహనకాండను, మల్లారెడ్డి హత్యను నివారించడం ఎందుకు సాధ్యం కాలేదనేది కమీషన్ ముందున్న నాలుగవ ప్రశ్న. ఈ ప్రశ్నను చర్చించేటప్పుడు జస్టిస్ గంగాధరరావుగారు రెండు విషయాలను కీలకంగా భావించారు. ఒకటి, మృతదేహాలను బోస్ విగ్రహం దగ్గరే పూడ్చిపెట్టాలని దళితనాయకులు పట్టుపట్టడం. రెండు, వరవరరావు గద్దర్ కత్తిపద్మారావు వంటి నాయకులు హాజరు కావడం వల్ల జనం అసహనంగా ఉండడం, చుండూరు దళితులు గతంలో శ్మశానంగా ఉపయోగిస్తున్నచోట ఇంతమందిని ఖననం చేయడానికి చోటు లేదని అందరూ ఒప్పుకున్నారని ఆయన అంటాడు. అయితే అందుకు ప్రత్యామ్నాయంగా రెవెన్యూ అధికారులు చూపించిన రెండు స్థలాలను దళితనాయకులు తిరస్కరించడానికి కారణం వాళ్ళు ముందుగానే ఊరిమధ్యన బోస్‌బొమ్మ దగ్గర మృతదేహాలను ఖననం చేయాలని నిర్ణయించుకోవడమే నంటాడు. ఈ నిర్ణయం 9వతేదీన జరిగిందనీ అంటాడు. గ్రామస్తులు దీనికి ఒప్పుకోరన్న విషయం అటుంచి, గ్రామం మధ్యన శవాలను పూడ్చిపెట్టడం 'హైందవ సాంప్రదాయానికి విరుద్ధం' అని ఈ నిర్ణయాన్ని జస్టిస్ గంగాధరరావుగారు విమర్శిస్తారు. చుండూరు దళితులు ఎక్కువగా క్రైస్తవులు కాబట్టి ఈ 'హైందవ సాంప్రధాయం' తమకు వర్తించదని వారు జవాబు చెప్తే? పొలాల మధ్య దళితులను నరకడానికి అభ్యంతరం చెప్పని హైందవ సంప్రదాయం ఊరి మధ్య ఖననానికి అభ్యంతరం ఎందుకు చెప్పాలని అడిగితే?

హైందవ సాంప్రదాయానికి విరుద్ధమైన ఈ నిర్ణయాన్ని దళిత నాయకులు 9వ తేదీనే తీసుకోగా, 10వ తేదీన అంత్యక్రియలు సమయంలో చుండూరుకు వచ్చిన జిల్లా కలెక్టర్ ఊరి మధ్య శవాలను పూడ్చిపెట్టడం జరగకూడదని, జరగనివ్వమని వాళ్ళతో ఖచ్చితంగా చెప్పకుండా వాళ్ళను నిర్ణయంమార్చుకొమ్మని అడుక్కున్నాడని జస్టిస్ గంగాధరరావుగారు జిల్లా కలెక్టర్‌ను అభిశంసించారు. కాబట్టి లెక్టర్‌ను బదిలీ చేసి 'గట్టి మనిషి' ని గుంటూరు జిల్లాలో వేయాలని సూచించారు. 'గట్టి మనిషి'

అంటే అర్థమేమిటో మళ్ళీ స్పష్టమే. దళితులు హైందవ సాంప్రదాయానికీ అగ్రకులాల ఇష్టానికీ అధికార్ల సూచనలకూ విరుద్ధంగా నడుచుకుంటే నిర్దాక్షిణ్యంగా ఆపేవాడని అర్థం. ఏ విధంగా ఆపగలడు? అంత జనసమ్మర్దంలో ఆయనకున్న మార్గం ఒకటే. పోలీసులను పురమాయించి కాల్పులు జరిపించాలి. మరికొంతమందిని చంపి అంత్యక్రియల కార్యక్రమాన్ని చెల్లాచెదరు చేయాలి. ఈ పనే చేసి ఉండాలని జస్టిస్ గంగాధరరావుగారి అభిమతమా? కాదు. అంతమంది జనం ఉన్నప్పుడు కాల్పులు జరపడం, చెదరగొట్టడం సరయిన చర్య కాదనీ పోలీసులు ఆ పని చేయకపోవడమే మంచిదయిందనీ ఆయన ఎస్.పి. మీనాను, డి.ఐ.జి అరవిందరావును అభినందిస్తారు. మరి అట్లాంటప్పుడు కలెక్టర్ 'కాదు కూడదనీ ఖచ్చితంగా చెప్పడం' ఎట్లా? ఈ కలెక్టర్ బదులు 'గట్టి మనిషి' ఉంటే ఏం చేసేవాడు? అసలు ఊరి మధ్య ఖననం చేయాలన్న నిర్ణయానికీ ఆ సాయంత్రం జరిగిన దహనకాండకూ మల్లారెడ్డి హత్యకూ ఎటువంటి సంబంధం లేదు. అంత్యక్రియలు ఎక్కడ జరిగినా ఆనాటి ప్రతీకార చర్యలు జరిగేవేవేమో. అటువంటప్పుడు జస్టిస్ గంగాధరరావుగారు ఈ చర్చ ఎందుకు చేసినట్టు?

అయిదవ ప్రశ్న ఒక నెలరోజుల తరువాత (సెప్టెంబర్ 10వ తేదీన) జరిగిన కాల్పులు. చుండూరు శిబిరంలో నిరాహారదీక్ష చేస్తున్న దేవరపల్లి ప్రసాదరావు, మద్దు దయాసాగర్ లను అరెస్టు చేసి ఆస్పత్రికి పంపించడానికి సెప్టెంబర్ 10వ తేదీ సాయంత్రం పోలీసులు బయలుదేరారు. తమ న్యాయమయిన ఆందోళనను పోలీసులు ఈ విధంగా భగ్నం చేయడం పట్ల దళితులు నిరసన వ్యక్తం చేసారు. ఆ నేపథ్యంలో చిన సోమ్లానాయక్ అనే హెడ్ కానిస్టేబుల్ కాల్పులు జరపగా అనిల్ కుమార్ చనిపోయాడు. ఈ కాల్పులు సమర్థనీయమాకాదా అనేది నిర్ణయించాలంటే కేవలం పోలీసుల సాక్ష్యం సరిపోదు. దళితుల సాక్ష్యం కావాలి. సహకారం కావాలి. అది లేకపోయినప్పటికీ జస్టిస్ గంగాధరరావుగారు తొణకకుండా తన కర్తవ్యం ముగించగలిగారంటే ఆశ్చర్యం కలగకమానదు. కాల్పుల గురించి పోలీసులు చెప్పిన కథనంలో వైరుధ్యాలున్నాయని ఆయనే గుర్తించాలి. దళితులలో కొందరు తీవ్రవాదులు చేరారనీ, వాళ్ళు కర్రలు, రాళ్ళు, సూదులు, కారప్పొడి వంటి ఆయుధాలు ధరించి పోలీసులపైన రాళ్ళు విసరడమేకాక సూదులతో పొడిచారంట, పోలీసుల బీర్జాలను పీకారంట. ఇది డి.ఎస్.పి. నుండి కానిస్టేబుళ్ళ దాకా అందరి సాక్ష్యం. ఇది అసంబద్ధంగా విడ్డూరంగా ఉందని జస్టిస్ గంగాధరరావుగారికి తోచలేదు. అయితే అనిల్ కుమార్ స్వయంగా చినసోమ్లానాయక్ పైన రాయి వేసి గాయం కలిగించగా అతను ఆత్మరక్షణ కోసం ఎదురు కాల్పులు జరిపాడనేది ఇతర పోలీసు సిబ్బంది కథనం. కాగా, కాల్పులు జరిపిన సోమ్లా నాయక్ తనపైన రాయి విసిరిందెవరో తెలీదంటాడు. రాయి తగిలి కింద పడి పోయాడంట. లేచి చూసేసరికి దళితులు రాళ్ళతో గొడ్డళ్ళతో దాడికి వస్తున్నారంట. చుట్టూ చూస్తే కాపాడే నాథుడు కనిపించలేదంట. ఇంక గత్యంతరం లేక రెండు రౌండ్లు కాల్చి స్పృహతప్పి పడిపోయాడంట.

ఇంతా చేసి అతని తలమీద ఉన్నది చిన్న గాయమే. పుర్రె ఎముకకు గాయం లేదు కేవలం చర్మానికే గాయం అయింది. అతని ఒంటిమీద వేరే ఏ గాయమూ లేదు. వేరే ఎవ్వరి ఒంటి మీదా గాయాలు లేవు. అదేమంటే సూదులతో పొడిచారనీ, బీర్జాలు పీకారనీ అంటారు!

చినసోమ్లానాయక్ కాల్పులు జరపడంలో 'ఆత్మరక్షణ' పరిధిని అధిగమించాడని జస్టిస్‌గంగాధరరావు భావిస్తూనే, అతనికి ఎవరినీ చంపే ఉద్దేశ్యం లేదనీ పైగా ఈ పని తన విధి నిర్వహణలో భాగంగా చేసాడనీ అందువల్ల అతనిపైన క్రిమినల్ కేసుపెట్టనవసరంలేదనీ నిర్ధారించారు. ఒకప్పటి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుండి ఇటువంటి అభిప్రాయం వినవలసి రావడం చాలా ఆశ్చర్యకరం. ఎవరయినా ఒక వ్యక్తి నిష్కారణంగా భయపడి జనంలోకి కాల్పులు జరిపి ఒకరి ప్రాణం తీస్తే అది 'ఆత్మరక్షణ పరిధిని అధిగమించే చర్య అయినప్పటికీ అతనికి ఎవరినీ చంపే ఉద్దేశ్యం లేదు కాబట్టి అతనిపైన కేసు పెట్టనవసరం లేదని' గంగాధరరావుగారు అంటారా? అది నిష్కారణంగా భయపడి చేసిన కాల్పులు కాదనీ, దళితుల తలలోనాల్కగా ఉన్న అనిల్ కుమార్‌ను కావాలనే కాల్చి చంపారనీ చుండూరు దళితులు అంటున్నారు. రాళ్ళు వేయడం, సూదులతో పొడవడం, బీర్జాలు పీకడం పట్టి అబద్ధం అంటున్నారు. నిరాహారదీక్షకు కూర్చున్న వారిని పోలీసులు బలవంతంగా తొలగించడానికి వచ్చి శిబిరం దగ్గర వున్న తిండి గింజలను చిందరవందర చేసి దౌర్జన్యం చేయగా దళితులు ప్రతిఘటించారనీ, అనిల్ కుమార్ ఘర్షణను శాంతపరచి గొడవ కాకుండా చూసే ప్రయత్నం చేసాడనీ, పోలీసులు కావాలనే అతనిని కాల్చి చంపారనీ చుండూరు దళితులు అంటున్నారు. వాళ్ళు కమీషన్‌కు సహకరించలేదు కాబట్టి వాళ్ళ సాక్ష్యం నమోదు కాలేదు. బాధితుల సాక్ష్యం నమోదు కానంతమాత్రాన వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని జస్టిస్ గంగాధరరావుగారు భావించారు. కాబట్టి కేవలం పోలీసుల సాక్ష్యాన్ని ఆధారం చేసుకొని నిర్ధారణకు వచ్చారు. పోనీ అదే నిజమనుకున్నా ఆయన చేసిన నిర్ధారణ ప్రకారమే హెడ్ కానిస్టేబుల్ సోమ్లానాయక్ పైన సెక్షన్ 302 కాకపోయినా 304 అయినా పెట్టనక్కర లేదా? నిరాధారంగా భయపడి కాల్పులు జరిపితే అది విధి నిర్వహణవుతుందా? డ్యూటీలో ఉన్నప్పుడు పోలీసులు ఏమి చేసినా అది విధి నిర్వహణ అవుతుందా? వాళ్ళు నిర్వహించవలసిన విధితో దానికి హేతుబద్ధమయిన సంబంధం ఉండనవసరం లేదా? న్యాయ శాస్త్ర కోవిదులయిన గంగాధరరావుగారికి ఈ ప్రశ్నలు కొత్తవా? లేకపోతే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయినంత మాత్రాన ఆయన న్యాయశాస్త్ర కోవిదుడయి ఉంటాడని భావించడం మన మూర్ఖత్వమా?

ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండడానికి కమీషన్ ప్రభుత్వానికి ఏమి సూచిస్తుందనేది చివరిప్రశ్న. దళితుల పునరావాసానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా జస్టిస్ గంగాధరరావుగారు ప్రస్తావిస్తూ, 'అవి అత్యంత ఉదారంగా ఉన్నాయి' అన్నారు. వాటి పరిస్థితి ఏమిటో దళితులు చెప్పకపోయినా దినపత్రికలు చదివి గంగాధరరావుగారు తెలుసుకొని ఉంటే బాగుండేది. క్లుప్తంగా చెప్పాలంటే 'అత్యంత ఉదారమయిన' ఈ హామీలలో ఒక్కటి మట్టుకే అమలయింది. అదేమిటంటే ఒక్కొక్క దళిత కుటుంబానికి రెండేసి గేదెలను ఇవ్వడం. ఒక గేదె ఉచితంగా, ఒకటి అప్పుగా ఇచ్చారు. ఈ గేదెల పాలు అమ్ముకుని బ్రతుకుతున్నారు చుండూరు దళితులు. ఒక్కొక్క కుటుంబానికి 1 ఎకరం వ్యవసాయభూమి ఇస్తామన్నారు. 700 కుటుంబాలు లెక్క చూపిస్తే 550 కుటుంబాలను మట్టుకే గుర్తిస్తామని చెప్పి వారిలో 57 కుటుంబాలకు మట్టుకు ఒక ఎకరం చొప్పున భూమి ఇచ్చారు. అందులో 26 ఎకరాలు మట్టుకే వ్యవసాయ యోగ్యమయినది. ('పంచపాండవులు మంచంకోళ్ళు...' జ్ఞాపకం వస్తోందా?) ఒక్కొక్క కుటుంబానికి ఒక్కొక్క ఇల్లు కట్టిస్తామన్నారు కానీ ఇప్పటికి (అంటే దాడి జరిగి సంవత్సరన్నర గడిచిన తరువాత) సగం ఇళ్ళుమట్టుకే తయారయ్యాయి. చదువుకున్న

వాళ్ళందరికీ ఉద్యోగాలిస్తామన్నారు. కానీ విన్నటిదాకా ఒక్కరికీ ఇవ్వలేదు. ఇప్పుడు ఇంటర్ పాసయిన వాళ్ళకు ఉద్యోగాలిచ్చే ప్రయత్నం ప్రారంభం అయిందని తెలుస్తోంది. కానీ పదవతరగతి పాసయి ఆపేసిన వాళ్ళు కూడా ఏవో కొన్ని ఉద్యోగాలకు అర్హులేకదా? వాళ్ళకెప్పుడిస్తాము? 'పునరావాస చర్యలు' కాక కేసు సత్వరం ముగియడం కోసం చుండూరు కోసమే ఒక ప్రత్యేక కోర్టు నెలకొల్పి ప్రత్యేక జడ్జినీ ప్రత్యేక పిపినీ నియమిస్తామని హామీ ఇచ్చారు. చేసిందేమిటంటే చుండూరులో ఒక కోర్టు బిల్డింగ్ కట్టారు. కానీ కేసుమట్టుకు గుంటూరులో వున్న మూడు జిల్లాల ఎస్.సి., ఎస్.టి. అత్యాచారాల ప్రత్యేక కోర్టులో అన్ని కేసులలో ఒక కేసుగా విచారణ జరుగుతున్నది. తేడా ఏమంటే ఈ కేసు వాయిదా ఉన్న రోజున జడ్జిగారు గుంటూరు బదులు చుండూరులో కూర్చుంటారు! ఇవీ గంగాధరరావుగారికి 'అత్యంత ఉదారంగా' కనిపించిన చర్యలు!

భవిష్యత్తులో ఇటువంటి దాడులు ఎక్కడా జరగకుండా ఉండాలంటే ఏమేమి చర్యలు తీసుకోవాలో కూడా జస్టిస్ గంగాధరరావుగారు సూచించారు. పోలీసు యంత్రాంగాన్ని పటిష్టం చేయాలి, సరయిన శిక్షణ ఇవ్వాలి, ఇంటలిజెన్స్ అభివృద్ధి కావాలి మొదలయిన సాధారణ సూచనలను పక్కకుపెడితే కొన్ని చెప్పుకోదగ్గ అభిప్రాయాలను, సలహాలను ప్రభుత్వం ముందుంచారు. వీటిని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే మేధావులు, న్యాయమూర్తులు, ఉదారులు అని మనం అనుకునే వాళ్ళ ఆలోచనలు ఎంత బాగున్నాయో తెలుసుకోవడం అవసరం. వీటిని వారి మాటలలోనే తెలుసుకుందాం :

1. చుండూరులో ఘర్షణకు కారణం అగ్రకులాల సంప్రదాయక ఆధిపత్యాన్ని చదువుకున్న దళితులు సవాలు చేయడం. అది విలువలకు కూడా సవాలు. ఇతర కులాలు దళితులను తక్కువగా చూడాలని ప్రయత్నించగా, అగ్రకులాలతో సమంగా ఆధునికతను సాధించుకున్న దళితులు సామాజికంగా గుర్తింపు కావాలని కోరుకుంటున్నారు. ఈ సమానత్వం తిరస్కరించబడిన కారణంగా కొందరు దళిత యువకులు దూకుడుగా ప్రవర్తిస్తున్నారు. వాళ్ళు ఇతర కులాలను కావాలని రెచ్చగొడుతున్నారు. చుండూరులో ఈ రెచ్చగొట్టే చర్యలు స్త్రీలను వేధించడం బలాత్కరించడం మొదలయిన రూపాలు తీసుకున్నాయి. స్త్రీలను వేధించడం అనేది అన్ని చోట్ల ఉండే విషయమే అయినప్పటికీ, అగ్రకులాల స్త్రీలను దళితులు వేధిస్తే ఉత్పన్నమయ్యే పరిస్థితులు భిన్నంగా వుంటాయి. అగ్రకులాలలో చాలా బలమయిన నిరసన తప్పనిసరిగా పుడుతుంది. వాళ్ళు దళితులను వేధించడానికి అవకాశం కోసం చూస్తుంటారు. ఈ రకమయిన రెచ్చగొట్టే చర్యలను అదుపు చేయడానికి ఒకటే మార్గం ఉంది. వాటికి బాధ్యులయిన వారిని వెంటవే గుర్తించి తగు చర్య తీసుకోవాలి. పోలీసులు ఉండవలసినంత చురుగ్గా లేరు. 'చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడం వ్యర్థం' అనే నానుడి అన్ని శాంతి భద్రతల సమస్యలకూ వర్తిస్తుంది. స్థానిక ఎస్.ఐ. ఈ దుష్ప్రవర్తనను వెంటవే గుర్తించి దోషులపైన చర్య తీసుకొని ఉంటే పరిస్థితి అదుపులోకి వచ్చేది. కాబట్టి సున్నితమయిన పరిస్థితి ఉన్న చుండూరు వంటి గ్రామాలలో, సకాలంలో గట్టి చర్య తీసుకోగల పోలీస్ అధికారులను నియమించాలని నేను సూచిస్తున్నాను.

2. గతంలో గ్రామాలలో ప్రభుత్వానికి కళ్ళు, చెవులుగా పనిచేసే గ్రామాధికార్లు ఉండేవారు. వారి ద్వారా గ్రామ పరిస్థితులు ప్రభుత్వానికి తెలిసేవి. గ్రామ మునసబు గ్రామ మేజిస్ట్రేట్‌గా వ్యవహరించేవాడు. స్థానికుడు కావడం వల్ల అతను పోలీసులకూ రెవిన్యూ వారికీ సమాచారం సేకరించడానికి ఉపయోగపడేవాడు. అంతేకాక గ్రామంలో శాంతిభద్రతలకు అతనే బాధ్యుడు. కాబట్టి గ్రామంలో ప్రభుత్వానికి వెన్నముకగా, ప్రతినిధులుగా ఉండి ప్రభుత్వానికీ గ్రామానికీ అనుసంధానం కుదిర్చే గ్రామ అధికారులను ప్రభుత్వం నియమించాలి.

3. రాజకీయపార్టీలు, నాయకులు ఇటువంటి ఘర్షణలవల్ల ప్రయోజనం పొందే ప్రయత్నం చేయకూడదు. దానివల్ల కుల సంఘర్షణలు పెరుగుతాయి తప్ప ఏ కులానికీ ప్రయోజనం కలగదు. కాబట్టి కుల ఘర్షణలలో ఎవ్వరూ ఏ కులం పక్షమూ తీసుకోకూడదనే ప్రవర్తనా నియమావళిని అన్ని రాజకీయపార్టీలు రూపొందించుకోవాలి. కులాలను ఐక్యంచేసి ఘర్షణను తొలగించే మార్గాన్ని అన్ని రాజకీయ పార్టీలు కలిసికూర్చొని అన్వేషించాలి. ఈ ప్రవర్తనా నియమావళి గ్రామస్థాయిలో కూడా అమలు కావాలి.

4. సున్నితమయిన విషయాలలో వేలుపెట్టి రాజకీయంగా ప్రయోజనం పొందడం అలవాటయిపోయిన నాయకమ్మన్యులు కొందరున్నారు. సంఘటన జరగడానికి కారణ భూతమయిన పరిస్థితులు ఏవయినా కానీగాక, సమస్యను ఆ గ్రామానికే పరిమితం చేసి ఇతర ప్రాంతాలలో దాని ప్రభావం పడకుండా చూడడం అవసరం. కాబట్టి గ్రామంలోకి అటువంటి వ్యక్తుల రాకపోకలను నిరోధించటం అవసరం.

5. దళితులు, దళితేతరులు గ్రామాలలో తరతరాలుగా నివసిస్తున్నారు. కొందరు వ్యక్తులు గ్రామం వదిలి మెరుగయిన బ్రతుకుకోసం బయటికి పోవచ్చునేమోగానీ ఒక కులం మొత్తంగా ఎక్కడికీ పోలేదు. ఇతర కులాలను కాదని విడిగా బ్రతకజాలదు. కాబట్టి తాత్కాలికంగా కులాల మధ్య ఏ ఘర్షణలు వచ్చినా అది శాశ్వత ఎడబాటుకు దారి తీయకూడదు. కాబట్టి ప్రభుత్వం తీసుకునే పునరావాస చర్యలు దళితులకు సహాయం చేయడానికి ఉపయోగపడడమే కాక, గ్రామాన్ని సామాజికంగా ఆర్థికంగా ఐక్యం చేసేటట్టు ఉండాలి. నా అభిప్రాయంలో ప్రత్యేక హాస్టళ్ళు, ప్రత్యేక స్కూళ్ళు, ప్రత్యేక గృహాలు కులాల ఐక్యతకు కాక విభేదాలను పెంచడానికే దోహదం చేస్తాయి.

వీటిలో మొదటిది (పైనచెప్పినట్టు) సర్వజనాభ్యుదయ పోరాటసమితి అవగాహన. రెండవది ఊడబీకిన మునసబు కరణంల (పటేల్ పట్వారీల) మనస్సులను రంజింపజేసే సూచన. గ్రామాలలో ప్రభుత్వానికి 'వెన్నెముకగా' 'అనుసంధానంగా' ఉంటూ వాళ్ళు చేసిన ఘనకార్యాలు ఎవరికి తెలియనివి! అగ్రకులాలు దళితులపైన దాడి చేస్తే 'ఎవరి పక్షం తీసుకోకుండా ఇద్దరినీ కలిపే ప్రయత్నం చేయాల'నే మూడవ సూచన గ్రామపెత్తందార్ల మనస్సుకు హత్తుకునే సూచన. వాళ్ళ అభిప్రాయం ఎప్పుడూ అదే! నాలుగవది ఎస్.పి.మీనా మనస్ఫూర్తిగా నమ్మి శాయశక్తులా అమలు చేసిన అభిప్రాయం. ప్రజల సమస్యలనుండి ఉత్పన్నమయ్యే ఉద్యమాలను, ఉద్యమకారులనూ సంఘవ్యతిరేక చర్యలుగా, వ్యక్తులుగా చూసే పోలీసుదృక్పథం నుండి పుట్టిన అభిప్రాయం ఇది. అయిదవది మండల్ వ్యతిరేక ఉద్యమకారులు మెడకు మైక్ కట్టుకొని ప్రచారం చేసిన అవగాహన. ప్రత్యేక హాస్టళ్ళు, ప్రత్యేక కాలనీలు దళితులు కోరుకోవడం వల్ల రాలేదు. అగ్రకులాల వైఖరి వల్ల వచ్చాయి. అవి లేకపోతే దళితులకు హాస్టళ్ళు, ఇళ్ళు లేకుండానే పోతాయేమో జస్టిస్ గంగాధరరావుగారు కొంచెం ఆలోచిస్తే బాగుంటుంది.

ఇన్ని చెప్పిన తరువాత వారు ప్రభుత్వం నేరవిచారణ త్వరగా జరిపించి హంతకులను శిక్షించాలనీ, దళితుల పునరావాసం కంటె వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలనీ, అగ్రకులాలు వారిని వేధించకుండా చూడాలనీ ప్రభుత్వానికి హితోపదేశం చేసి ఏం ప్రయోజనం?

చుండూరు తరువాత

15 గ్రామాల్లో 17 మంది హత్య

(చుండూరు మారణకాండ తరువాత రాష్ట్రంలో దళితులను అగ్రకులాల వారు హతమార్చిన సంఘటనల జాబితా ఇక్కడ ఇస్తున్నాము. ఈ జాబితా సంపూర్ణమయినదికాదు. కుల ఆధిపత్యంతో సంబంధం లేకుండా కేవలం హతుడు దళితుడు, హంతకుడు అగ్రకులస్థుడు అయిన సంఘటనలు చాలానే ఉంటాయి. వాటిని లెక్కపెట్టవవసరం లేదు. అయితే కుల ఆధిపత్యంతో ముడిపడిన హత్యలు ఇంతకంటే ఎక్కువే ఉంటాయి. ఇవి కేవలం పత్రికల దృష్టికీ ఉద్యమకారుల దృష్టికీ వచ్చిన ఘటనలు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలలో ఎవరి దృష్టికీ రాకుండా పోయిన ఘటనలు ఇంకా చాలా ఉంటాయి.)

1. **27 డిసెంబర్ 1991.** గ్రామం పోలెపల్లి (దొనకొండ మండలం, ప్రకాశంజిల్లా). హతుడు యద్దనపూడి గురవయ్య (ఎస్.సి.). వెంకటరామిరెడ్డి అనే రైతు దగ్గర ఇతను పనిచేసేవాడు. ఆసామి ఇస్తానని ముందు ఒప్పుకున్న కూలి ఇవ్వకపోయేసరికిగొడవ పెట్టుకున్నాడు. తాను గొడవ పెట్టుకోవడమేకాక ఊరి కూలి జనాన్ని ఏకం చేసి భూస్వాములకు వ్యతిరేకంగా ఆందోళన చేయించాడు. దానికి కక్షగా గురవయ్యను హత్య చేశారు. దొనకొండ నుండి పోలెపల్లికి డిసెంబర్ 27 సాయంత్రం సైకిల్‌పైన వస్తుండగా భూస్వాముల మనుషులు దారికాచి గొడ్డళ్ళతో కర్రలతో దాడిచేసి చంపారు. శవాన్ని ముక్కలుచేసి సంచిలో వేసి బావిలో పడేశారు. మూడవరోజు శవం బావిలో తేలిన తరువాత గానీ అతని హత్య సంగతి తెలియలేదు.
2. **26 ఏప్రిల్ 1992.** గ్రామం చీమకుర్తి (ప్రకాశం జిల్లా). హతురాళ్ళు ఏసమ్మ, రమణమ్మ, అంజమ్మ (ఎస్.సి.). క్వారీలో ఇటుకలు దించే పని ఉందని చెప్పి ఈ ముగ్గురినీ మరొక ఇద్దరినీ క్వారీ మనుషులు తీసుకొని పోయారు. క్వారీ నీటిలో మునిగి ముగ్గురూ బలవన్మరణం పాలయ్యారు. క్వారీ దగ్గర ఏసమ్మపైన అత్యాచారం జరగగా మిగిలిన స్త్రీలిద్దరూ ఎదురుతిరిగారనీ, ముగ్గురినీ కొట్టి క్వారీ నీళ్ళలో పడేసి చంపారనీ నమ్మడానికి ఆధారాలున్నాయి. పలుక్వారీల యజమాని, కోటేశ్వరుడు అయిన సిద్దా ప్రకాశరావు (కోమటి కులస్థుడు) ఆధ్వర్యంలో ఇది నడిచిందని ఒక ప్రత్యక్ష సాక్షి కథనం. అయితే పోలీసులు ఈ మరణాన్ని 'అనుమానాస్పద మరణం'గానే తప్ప హత్య, లైంగిక అత్యాచారం కేసుగా నమోదు చేయలేదు. ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది.
3. **7 మే 1992.** గ్రామం కరేడు (ఉలవపాడు మండలం, ప్రకాశం జిల్లా). హతుడు నాశం వెంకట సుబ్బయ్య (ఎస్.సి.). ఇతను బొడ్డు సుధాకరరెడ్డి అనే రైతుదగ్గర ఇటుకబట్టీలో కూలి చేసేవాడు. వేతనం గురించి గొడవ పెట్టుకొని అతని దగ్గర పనిమానేసి వేరే యజమానిని వెతుక్కున్నాడు. అప్పుడు మొదలయిన స్పర్థలు క్రమంగా పగగా మారి, మొదటి యజమాని మరొక ఇద్దరు మిత్రులతో కలిసి కుట్రపన్ని వెంకటసుబ్బయ్యను ఒకరోజు బండిపైన ఎక్కించుకొని తీసుకుపోయి బండికర్రతో కొట్టి హతమార్చాడు. ఒక గడ్డివాములో దూర్చి దాచి పెట్టారు. ఒక స్త్రీ విషయమై అతనితో ఘర్షణ ఉండిందని కూడా అంటారు. హంతకుల పేర్లు బొడ్డు సుధాకరరెడ్డి, దొడ్ల రామిరెడ్డి, వీరేపల్లి కోటిరెడ్డి. నిందితులు కందుకూరు ఎం.ఎల్.ఏ మహీధరరెడ్డి ఇంట్లో దాక్కున్నారు (మాచవరంలో).
4. **29 మే 1992.** గ్రామం తమ్మవరం (పెదకూరపాడు మండలం, గుంటూరు జిల్లా.) హతుడు కుంభానాగేశ్వరరావు (ఎరుకల-ఎస్.టి.) ఇతను కూలి చేసుకుని బతికేవాడు. గ్రామంలోని ఒక ముస్లిం కుటుంబం తమ చేనుకోసం బావి తవ్వించారు. బావిలో నీటి ఊట బాగా రావాలంటే నరబలి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. కూలిపని ఉంద రమ్మని మోసపూరితంగా అతనిని ఇంటినుండి తీసుకుపోయి బావి చుట్టూ ప్రదక్షిణం చేయించి తల పగుల గొట్టి చంపారు.
5. **29 మే 1992.** గ్రామం దొడ్డి బెళగల్ (కోసిగి మండలం, కర్నూలు జిల్లా). హతుడు నూకలూటి సింహాచలం (ఎస్.సి.). ఇతను పేదరైతు. ఒక బోయ (బి.సి.) కులస్థుడైన రైతు తన భార్యను బలవంతంగా లొంగదీసుకున్నందుకు ఆగ్రహించి గొడవ పెట్టుకున్నాడు. అందువల్ల కక్షగట్టిన అన్నదమ్ములు బోయతిమ్మప్ప, బోయతిక్కన్న ఇతను పొలానికి పోయిన సమయంలో కర్రలతో, ఇతర ఆయుధాలతో దాడిచేసి కొట్టి చంపారు. హంతకులకు స్థానిక కాంగ్రెస్ నాయకుల అండ ఉండడం వల్ల పోలీసులు వాళ్ళను అరెస్టు చేయలేదు. హతుడి భార్యా బంధువులనే బెదిరించారు. అయితే జిల్లా పౌరహక్కుల సంఘం, ఎస్.సి., ఎస్.టి., ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ విషయంలో జోక్యం చేసుకొని అధికార్లపైన ఒత్తిడి తెచ్చిన తర్వాత (హత్య జరిగిన నెల రోజుల తర్వాత) హంతకులను అరెస్టు చేశారు.
6. **14 జూన్ 1992.** గ్రామం మాచనపల్లి (దువ్వూరు మండలం, కడప జిల్లా) హతుడు వెంకటేశ్వర్లు. వడ్డెర (బి.సి.). ఇతను ఊరూరు తిరిగి బట్టలు అమ్ముకొని బ్రతికేవాడు. ఇతని భార్య గంగమ్మ పైన చాకిరి సుబ్బారెడ్డి అనే భూస్వామి కొడుకు అత్యాచార ప్రయత్నం చేయగా ఇతను సుబ్బారెడ్డి ఇంటి దగ్గరికి పోయి గట్టిగా తిట్టి పోయాడు. ఆ రోజు మధ్యాహ్నం సుబ్బారెడ్డి మనుషులు ఇతని ఇంటి దగ్గరికి వచ్చి 'రెడ్డి రమ్మంటున్నాడ'ని పిలుచుకొని పోయి కొట్టారు. అతను పారిపోగా తరిమికొట్టి తీవ్రంగా గాయపరచి సజీవంగా దహనం చేశారు. హంతకులకు ప్రొద్దుటూరు ఎం.ఎల్.ఎ. వరదరాజులు రెడ్డి రక్షణ కల్పించాడు. గంగమ్మను బెదిరించి తన భర్త చనిపోలేదనీ, బట్టలు అమ్ముకోవడానికి పోయాడనీ ఆమెచేత చెప్పించారు. జిల్లా పౌరహక్కుల సంఘం పోరాడితీసుకొనేదాక పోలీసులు హంతకులను అరెస్టు చేయలేదు.

7. 25 జూన్ 1992. గ్రామం వీరవరం (కడియం మండలం, తూర్పు గోదావరి జిల్లా) హతుడు నూకతాటి సింహాచలం (ఎస్.సి). ఇతను పాలేరు. అదే గ్రామానికి చెందిన ముద్రగడ రాంబాబు, ముద్రగడ పెదకాపు, ముద్రగడ సత్యనారాయణ అనే అగ్రకుల రైతులు ఇతన్ని జూన్ 25వ తేదీన హత్యచేసి రహస్యంగా ఖననం చేశారు. దళిత సంస్థలు, స్థానిక దళితులు చాలా ఆందోళన చేయగా 40 రోజుల అనంతరం శవాన్ని బయటకు తీసి పోస్ట్ మార్టం జరిపించి కేసు నమోదు చేసుకోవడం జరిగింది. హంతకులు కాపుకులస్తులు.

8. 11 నవంబర్ 1992. గ్రామం కంకట పాలెం (బాపట్ల మండలం, గుంటూరు జిల్లా) హతుడు గండకోట శివయ్య. ఉప్పరి (బి.సి.). ఇతను పోతూరి సదాశివరావు అనే రైతు దగ్గర పనిచేసేవాడు. ఆ రైతు ఇంటి చావిట్లో శవమై దూలానికి వేలాడుతూ కనిపించాడు. వృషణాలపైన దెబ్బ తగిలి బాగా వాచి ఉన్నాయి. సదాశివరావు, అతని పక్కింట్లో ఉండే మానం గాంధీ అనే మరొక రైతు ఇతనిని కొట్టి చంపి వేళ్ళాడదీశారు. కొట్టింది గాంధీ ఇంటి స్నానాల గదిలో. వేళ్ళాడదీసింది మృతుని యజమాని ఇంటిచావిట్లో. మృతుడు తనయజమాని మాట లెక్కచేసేవాడు కాదనీ ఆ కోపం యజమానిలో పగగా మారి చివరికి హత్య చేసాడనీ మృతుని తండ్రి కథనం. కాగా పక్కింటి అమ్మాయిని (మానం గాంధీ కుమార్తె) మృతుడు వేధించేవాడనీ అందువల్ల ఆయన మృతుడుని తన ఇంటికి పిలిపించి కొట్టి ఉంటాడని దెబ్బలకు ఇతను చనిపోగా మెడకుతాడు కట్టి యజమాని ఇంటిచావిట్లో వేల్లాడదీసి ఉంటారనీ మరొక కథ. రైతులిద్దరూ కమ్మకులస్థులు. పోలీసులు ఇప్పటికీ హత్యకేసు పెట్టలేదు. 'అనుమానాస్పద మృతి' మాత్రమే వంటున్నారు.

9. 31 డిసెంబర్ 1992. గ్రామం పిచ్చికల పాలెం (శ్యావల్యాపురం మండలం, గుంటూరు జిల్లా) హతుడు కలుపుకూరి యలమంద (యస్.సి.). ఇతను మతుకుమల్లి సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టరుగా రిజర్వు కోటాలో ఎన్నికైనాడు. డైరెక్టర్లలో రెండు గ్రూపులున్నాయి. రెండింటి ముఖ్యులు కమ్మ కులస్థులే. రెండు గ్రూపులకూ యలమంద సహాయం అవసరం కాబట్టి అతనిపైన రకరకాల వత్తిడిలు పెడుతుండేవారు. ఒకరైతుకు అప్పు మంజూరు చేసే విషయంలో యలమంద సంతకం కావలసి వచ్చి పొందూరు పిచ్చయ్య అనే డైరెక్టర్ డిసెంబర్ 29వ తేదీన అతనిని బలవంతంగా వినుకొండ తీసుకొని వచ్చి తాగించి సంతకం తీసుకొన్నాడు. అయితే పుస్తకాలు యలమంద దగ్గరే ఉండి పోయాయి. ఆరోజు రాత్రి మరికొందరు డైరెక్టర్లు (గాలి నాగేశ్వరరావు, ఏరుపాటి చినకోటయ్య, తిరువీథి నాగేశ్వరరావు, కనపర్తి వెంకటేశ్వర్లు) అతనిని మళ్ళీ కిడ్నాప్ చేసి వ్యాన్‌లో తీసుకొని పోయారు. 31వ తేదీవరకు తమ నిర్బంధంలో ఉంచుకొని అన్నం పెట్టకుండా బాగా తాగించారు. 31 సాయంత్రం వాళ్ళు అతనిని శ్యావల్యాపురం నుండి పిచ్చికలపాలెం తీసుకొని వస్తుండగా దారిలో పడిపోయాడు. ఇంటికి చేర్చేసరికి చనిపోయాడు.

10. 1 జనవరి 1993. గ్రామం గుడివాడ (తెనాలి మండలం, గుంటూరు జిల్లా) హతుడు చండిక బసవ శంకరరావు (పెరిక). ఇతను పేదరైతు. ఇతని కుమార్తె వీరలక్ష్మిని 1991లో ఇదే గ్రామానికి చెందిన రావూరి శేఖర్ అనే కమ్మ యువకుడు పట్టపగలు ఇంట్లోకి బలవంతంగా లాక్కుపోయి రేప్ చేశాడు. పెద్ద మనుషులు రాజీ ప్రయత్నాలకు శేఖర్ సమ్మతించకపోగా, తండ్రీ కూతురు పట్టుదలగా నిలబడి కేసుపెట్టి కోర్టులో సాక్ష్యాలు నమోదయ్యేటట్లు చూశారు. కేసు అయిపోవస్తుండగా 1992 డిసెంబర్ 30వ తేదీన 'రెండురోజులలో నీ సంగతి చూస్తాను' అని శేఖర్ తెనాలి కోర్టులోనే ఇతనిని బెదిరించాడు. అన్నట్టుగానే కొత్త సంవత్సరం తొలిరోజు రాత్రి బసవ శంకర్‌ను రావూరి శేఖర్ మరి ముగ్గురుకమ్మ యువకుల సహాయంతో గ్రామంలోని చర్చి ఎదురుగా ఉన్న దుకాణం మెట్లమీద కత్తితో పొడిచి హతమార్చాడు.

11. 8 జనవరి 1993. గ్రామం కుందుర్రు. (సంతమాగులూరు మండలం, ప్రకాశం జిల్లా). హతురాలు గట్టు ఈశ్వరమ్మ (చాకలి). ఈమె బీరం వెంకయ్య అనే కమ్మ కులస్థుడయిన రైతు ఇంట్లో పని చేసేది. జనవరి 8నాడు అతని వదిన రాఘవమ్మ ఈమెను ఏదోసాకు చెప్పి ఇంట్లోకి పంపించగా అతను గదిలో బంధించి అత్యాచారం చేశాడు. ఆమె ప్రతిఘటించిన కారణంగా కసికొద్దీ చంపేశాడు. సాయంత్రం దాకా శవాన్ని గదిలోనే తాళంవేసి వుంచారు. సాయంత్రం ఈశ్వరమ్మ తల్లి వచ్చి గొడవచేయగా శవం ప్రక్కన పురుగుల మందు డబ్బా పెట్టి తలుపుతీసి ఈశ్వరమ్మ ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆత్మహత్యకేసు అయితే మీకే ఇబ్బంది అని బెదిరించి పోలీసు ఫిర్యాదు లేకుండా, శవ పరీక్ష జరుపకుండా శవాన్ని తగుల బెట్టించారు. చాలా రోజుల తర్వాత కాని విషయం బయటికి రాలేదు.

12. 18 జనవరి 1993. గ్రామం గొల్లగట్టు (కొనకన మిట్ల మండలం, ప్రకాశం జిల్లా) హతుడు సోమయ్య (ఎస్.సి.). ఇతను బైర్లు రిపేరు చేసేవాడు. ఇతని స్వగ్రామం గొల్లగట్టు దగ్గరున్న నాయుడుపేట. పని చేసేది దర్శిలో. జనవరినెలలో తన స్వగ్రామానికి వచ్చాడు. అక్కడ అమ్మ, తమ్ముళ్ళు ఉంటారు. తమ్ముళ్ళకు తమ పొలం విషయంలో కొందరు కమ్మ కులస్తులయిన రైతులతో ఘర్షణ ఉండింది. సోమయ్య 17వ తేదీన దర్శికి పోతానని చెప్పి 20 రూలు జేబులో వేసుకొని ఇంటినుండి బయలుదేరాడు. 18వతేదీన తప్పతాగి గొల్లగట్టులో పడివున్నాడని కొందరు రైతులు నాయుడుపేటలోని అతని కుటుంబానికి తెలియజేయగా తమ్ముళ్ళుపోయి అతన్ని ఇంటికి తీసుకొచ్చారు. అతని ఒంటిమీద దెబ్బలున్నాయి. చాలాసేపు మాట్లాడలేదు. చివరికి, తన తమ్ముళ్ళతో ఘర్షణ ఉన్న రైతులు తనకు తాగబోసి బాగా కొట్టారని మాత్రం చెప్పి కొంతసేపటికి చనిపోయాడు. హంతకుల పేర్లు గోరంట్లనర్సయ్య, బిక్కి వెంకటేశ్వర్లు, కోట్ల వెలుగొండరాయుడు.

13. 27 జనవరి 1993. హతురాలు పచ్చల మరియమ్మ (యస్.సి.). గ్రామం నరమాలపాడు (కారంపూడి మండలం, గుంటూరుజిల్లా) ఈమె కూలి చేసుకొని బతికేది. జనవరి 27 నాడు తన కుమార్తెను మరికొందరిని వెంటపెట్టుకొని కూలికి పోయింది.

దారిలో రోడ్డు ప్రక్కన ఒక చెప్పుల జత కనిపించింది. ఆమె యథాలాపంగా ఆ చెప్పులు తొడుక్కొని ముందుకు సాగింది. ప్రక్కనే పొలంలో వున్న చెప్పుల యజమాని కర్నాటి రామసుబ్బయ్య (కమ్మ కులస్థుడు) ఈ సంగతి గమనించి ఆమె మీదికి దాడి చేసి జుట్టుపట్టుకొని లాగి విపరీతంగా కొట్టాడు. బూతులు తిడుతూ, కడుపుపైన, గుండెలమీద తన్నాడు. ఇరుగు పొరుగు పొలాలరైతులు జోక్యం చేసుకొని అతనిని ఆపారు. అయితే మరియమ్మ ఇంటికి చేరేసరికి చనిపోయింది.

14. 1 మార్చి 1993. గ్రామం బుర్రిపాలెం (తెనాలి మండలం, గుంటూరుజిల్లా) హతుడు కోట భూషణం (యస్.సి.). ఇతను కిలారి కోటయ్య అనే కమ్మ కులస్తుడయిన రైతు ఇంట్లో పనిచేసేవాడు. వాళ్ళు చాలాకాలం ఇతని స్వగ్రామమైన ఓర్వకల్లు (అచ్చంపేట మండలం, గుంటూరుజిల్లా) లో వుండేవారు. అక్కడినుండి వాళ్ళు బుర్రిపాలెం వెళ్ళిపోయిన తరువాత కూడా ఏవైనా ముఖ్యమయిన పనులు వున్నప్పుడు ఇతను బుర్రిపాలెం పోయి పనిచేసి వచ్చేవాడు. ఇతని యజమాని కిలారి కోటయ్య దాదాపు 20 ఏళ్ళుగా ఇల్లు వదిలి పెట్టి సన్యాసి అయి తిరుగుతున్నాడు. కోటయ్య భార్య ఇంటి వ్యవహారాలు చూసుకొనేది. ఈ మధ్యనే కోటయ్య బుర్రిపాలెం తిరిగి వచ్చాడు. మార్చి 1వ తేదీన కోటయ్యకు అతని భార్యకు ఘర్షణ జరుగుతూవుంటే అడ్డం రావడం సహించని కోటయ్య అతని నెత్తిమీద రోకలితోకొట్టి చంపాడు. భూషణానికి తన భార్యతో సంబంధం వుందని కోటయ్య అనుమానించి చంపాడని పోలీసుల కథనం.

15. 5 మార్చి 1993. గ్రామం బప్పిచర్ల (కారంపూడి మండలం, గుంటూరు జిల్లా) హతుడు షేక్ మీరావలి, (దూదేకుల). ఇతను కార్మికుడు. పంగులూరి వెంకటేశ్వర్లు అనే కమ్మ కులస్తుని రైస్‌మిల్లులో పనిచేసేవాడు. కరెంటు దొంగతనం చేయడంలో యజమానికి సహాయం చేసేవాడు. ఆ తర్వాత అతను వేరేమిల్లులోకి మారాడు. కొన్నాళ్ళకు విజిలెన్స్ అధికారులు మొదటి యజమాని మిల్లుపైన దాడి చేసి కరెంటు దొంగతనం కేసుపెట్టి ఒక లక్షరూపాయలు జరిమాన వసూలు చేశారు. మీరావలి ఇచ్చిన సమాచారం ఆధారంగానే ఈదాడి జరిగి వుంటుందని భావించిన మొదటి యజమాని వెంకటేశ్వర్లు అతనిని పట్టుకొని చంపి బావిలో పడేశాడు.

ఎన్‌కౌంటర్ల సంవత్సరం 1992
నెలవారీగా 'ఎన్‌కౌంటర్' మృతుల సంఖ్య

జనవరి	27	ఫిబ్రవరి	21
మార్చి	22	ఏప్రిల్	25
మే	33	జూన్	26
జూలై	15	ఆగస్టు	16
సెప్టెంబర్	30	అక్టోబర్	23
నవంబర్	9	డిసెంబర్	9
మొత్తం			256

ఒకే ఎన్‌కౌంటర్‌లో నలుగురు లేక అంతకంటే ఎక్కువ మంది చనిపోయిన ఘటనలు 12.

పగిడేరు ఎన్‌కౌంటర్‌లో (వ్యాన్ డ్రైవర్‌ను కలుపుకొని) 14 మంది.

అచ్చంపల్లి ఎన్‌కౌంటర్‌లో 10 మంది.

ఏకనాంపేట ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు.

క్రిష్ణనగర్, బద్దిపల్లి, మైలారం ఎన్‌కౌంటర్‌లలో ఆరుగురు చొప్పున.

అంబాల ఎన్‌కౌంటర్‌లో అయిదుగురు.

ఈదులగట్టెపల్లి, కుల్లారెడ్డిపల్లి, పోరువాక, విశ్వనాథపురం, చిక్కుడుగుంట ఎన్‌కౌంటర్లలో నలుగురు చొప్పున.

కొత్త సంవత్సరంలో 'ఎన్‌కౌంటర్లు'

22 జనవరి హైదరాబాద్ వెలుపల ఉన్న కుషాయి గూడ (రంగారెడ్డి జిల్లా) పోలీస్ స్టేషన్ పరిధిలోని కుషాయి గూడ ఆర్‌టిసి డిపో వెనక ఉన్న గుట్టలలో 22 జనవరి రాత్రి గోపాలరాజు, నరేష్ అనే ఇద్దరిని పోలీసులు కాల్చేసారు. విశేషమేమిటంటే ఈ 'ఎన్‌కౌంటర్' గురించి పోలీసులు ఇచ్చిన ప్రకటన పత్రికా కార్యాలయాలకు చేరకముందే, వీళ్లిద్దరినీ మూడు రోజుల క్రితం బొలారంలో అరెస్టు చేసారనీ చంపేసే ప్రమాదముందనీ ఆందోళన వ్యక్తం చేస్తూ రాడికల్స్ ఇచ్చిన ప్రకటన పత్రికా కార్యాలయాలకు అందింది. వాళ్లు భయపడినట్టే పోలీసులు వీరిద్దరినీ గుట్టల దగ్గరికి తీసుకొచ్చి బండరాళ్లకు వీపు తిప్పి నిలబెట్టి కాల్చేసారు. జనసంచారం దండిగా ఉండే పారిశ్రామిక ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగినట్టు పోలీసులు చెప్పేదాకా ఎవరికీ తెలియలేదు.

24 జనవరి వరంగల్ జిల్లా జనగాం సమీపంలో 24 జనవరి పొద్దున్న మారుతీ వ్యాన్‌లో వస్తున్న నక్సలైట్లతో పోలీసులకు ఎదురు కాల్పులు జరిగినట్టు, అందులో గుండెబోయిన అంజయ్య (బాలన్న), పద్మ చనిపోయి మిగిలిన వాళ్లు తప్పించుకున్నట్టు పోలీసులు వీరోచితమయిన కథ అల్లి ప్రకటించారు.

నిజానికి బాలన్ననూ పద్మనూ పోలీసులు 23వ తేదీ రాత్రే హైదరాబాద్‌లోని శాంతినగర్‌లో అరెస్టు చేసారు. బాలన్న చిన్నమ్మ సుశీల ఇంట్లో అరెస్టు చేసారు. బాలన్నను అక్కడే తలమీద గట్టిగా కొట్టి గాయపరిచారు. ఇంటి వాళ్లందరినీ అరెస్టు చేసి తీసుకొని పోయారు. బాలన్నను పద్మను ఆరాత్రే చంపేసి 24 పొద్దున్న అతని స్వగ్రామమైన